# ఆహుతి



దీప్యమానంగా వెలిగే లైట్లకింద పచ్చని తివాసీమీద మెల్లగా నడుస్తూ హాల్లోకి వచ్చారు జానకి, మధుకరూను.

"మరీ అలా తలవంచుకోకు." మెల్లిగా అంటున్నాడు మధుకర్.

జానకి తలఎత్తింది. భర్త వెనకాలే మెల్లిగా నడుస్తూ లోపల ప్రవేశించింది. అక్కడ ఉన్నవారందరికళ్ళూ వీరిద్దరిమీదా నిలిచాయి ఒక్క క్షణం. ఒక్కసారిగా ఇంతమంది చూపులు తనమీద ప్రసరించేసరికి జానకి సిగ్గుతో కుంచించుకు పోతూ తల వంచేసుకుంది.

"హల్లో! కంగ్రాట్యులేషన్స్. నమస్కారం మిసెస్." సుధాకరానికి షేక్‌హాండ్ ఇచ్చి జానకికి నమస్కరించాడు ఒక అతను వచ్చి.

జానకి అలాగే నిలబడింది ఏం మాట్లాడాలో తోచక. వెంటనే ఏదో గుర్తువచ్చినట్టు ప్రతి నమస్కారం చెయ్యటానికి చేతులెత్తింది. కానీ అప్పటికే అతను వేరొకర్ని ఆహ్వానించటానికి పక్కకు వెళ్ళిపోయాడు. జానకి భర్తవేపు చూసింది. సుధాకర్ కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. కళ్ళనిండా సాధ్యమైనంత కోపాన్ని నింపుకుని భార్యవేపు తీవ్రంగా చూశాడు. చటుక్కున కళ్ళు దించేసుకుంది జానకి, కళ్ళలో నిలిచిన నీళ్ళు భర్త చూడకుండా.

సభ ముగిసింది. ప్రఖ్యాత రచయిత్రి అరుణాదేవి ఉపన్యాసం ఇచ్చింది. ఆమె వేదిక దిగగానే అధ్యక్షుడు లేచి, అరుణాదేవిఇంతపైకి రావటం తనకుసంతోషమనీ, ఇదే విధంగా దేశంలో ప్రతిస్త్రీకూడా సాహిత్యకృషి చెయ్యాలనీ, అప్పుడే దేశం అన్నివిధాలా అభివృద్ధి చెంది నట్టనీ, ఇంకా ఏదో మాట్లాడాడు. జనం ఒక్కసారిగా చప్పట్లు కొట్టారు. అరుణాదేవిని పూలమాలతో అలంకరించారు. పక్కనే కూర్చున్న ఆమె భర్త గర్వంగా నవ్వుకోవటం చూశాడు సుధాకర్. అందరితోపాటు తనూ యాంత్రికంగా లేచాడు.

సుధాకర్, జానకి బయటకు వచ్చేస్తూంటే అరుణాదేవి కలిసి ఒక్క నిమిషం మాట్లాడింది.

"కొత్తగా ఏమైనా వ్రాస్తున్నారా?" అని అడిగాడు సుధాకర్.

"అవునండీ. రేపటి సాహిత్యసమావేశానికి ఒక నివేదిక వ్రాయవలసి ఉంది. నా ఉపన్యాసం కూడా ఉంటుంది. మీరు తప్పక రావాలి" అని జానకివేపు తిరిగి, "మీరు కూడా" అంది.

అప్పటికే భర్త ప్రవర్తన అర్థంకాక తికమకపడుతున్న జానకి అయోమయంగా తల ఊపింది. ఇద్దరూ బయటికి వచ్చేశారు. ఇంటికి వచ్చేవరకూ మౌనంగానే ఉన్నాడు సుధాకర్. అతన్ని ఏదైనా మాట్లాడించాలని చూసింది జానకి. కానీ అతని మౌనం ఆమెలో ఒక విధమైన వంకోచాన్ని కలగజేసింది.

ఇంటికి రాగానే నిశ్శబ్దంగా పడుకున్నాడు సుధాకర్. జానకి మెల్లిగా భర్త దగ్గిరికి వచ్చింది.

పక్కనే కూర్చుని "అలా ఉన్నారేం?" అని అడిగింది. అతను మాట్లాడకుండా భార్యవేపు తిరిగాడు. కొద్దిసేపు మాట్లాడలేదు. ఉన్నట్టుండి అన్నాడు: "నా కోరిక నువ్వు తీర్చవన్నమాట."

జానకి అర్థం కానట్టు చూసింది. "కోరికేమిటి?"

"నీకు తెలీదా? మన్నుతిన్న పాములా, ఏ ఆలోచనా, మనస్సులో ఏ భావమూ లేకుండా నువ్వు ఇలా యాంత్రికంగా ఎన్నాళ్ళు గడుపుతావు? ఆ అరుణాదేవిని చూసినా కూడా నీలో ఏ మార్పూ కలగటంలేదా?"

జానకి తల దించుకుంది. 'ఇదన్నమాట ఆయన కోపానికి కారణం' అనుకుంది.

"ఇదా! సరేలెండి. రోజూ ఉండే భాగవతమేగా!" అనేసి అక్కణ్ణుంచి వెళ్ళబోయింది. సుధాకర్ ఆమెను వెళ్ళకుండా ఆపాడు.

"ఇటు చూడు. ఎందుకలా వెళ్ళిపోతావు? నా మాట అసలు వినటం లేదన్నమాట!"

"నేనేం చెయ్యాలి, చెప్పండి."

"ఏం చెయ్యాలా? అస్తమానం ఆ కుట్లూ, అల్లికలూ తప్ప ఇంకేం చెయ్యలేవా నువ్వు?"

"మీరు మీ ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోమంటే కూర్చోగలరా?"

"మాటకి మాట సమాధానం చెప్పటం మాత్రం చేతవును." అతని కంఠంలో కోపం ప్రవేశిస్తోంది.

జానకి మాట్లాడలేదు. కింది పెదవి మునిపంటితో కొరుకుతూ కూర్చుంది.

కొంచెం అనునయంగా అన్నాడు సుధాకర్: "నే నేదో నిన్ను శాసిస్తున్నా ననుకోకు, జానకీ. నీలో నేను కోరుకునేవన్నీ ఉన్నాయనే ఇన్నాళ్ళూ అనుకున్నాను. కానీ ఈ విషయంలో మటుకు నీలో అభిరుచి ఉండీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావో నాకు అర్థం కావటం లేదు."

"అబ్బ! నన్ను బలవంతపెట్టకండి. నా కేదో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలనీ లేదు, ఏదో సాధించాలనీ లేదు. నన్నిలా సామాన్యంగా ఉండనివ్వండి." జానకి అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న ఆమె వేపు గుడ్లప్పగించి చూస్తూ ఊరుకున్నాడు సుధాకరం.

• • • •

అర్ధరాత్రి రెండుగంట లయింది. సుధాకర్ ఇంకా ఇంటికి రాలేదు. జానకి కంటిమీద రెప్పవెయ్యకుండా అలాగే కూర్చుంది ఎదురు చూస్తూ. మెల్లిగా బూట్లు చప్పుడు. జానకి లేచి నిలబడింది.

"ఇంకా పడుకో లేదూ?" సుధాకర్ బట్టలు మార్చుకుంటూ ఉన్నాడు.

"ఊహుఁ. ఇంత ఆలస్యమైందేం?"

"ఏదో మీటింగు ఉంది."

పడుకోబోతూండగా, "ఇంతవరకూ ఏం చేస్తున్నావు?" అని అడిగాడు సుధాకర్.

"ఏం లేదు. ఊరికే కూర్చున్నాను."

జానకి సమాధానం వింటూనే అతని కంఠం కఠినంగా మారిపోయింది. "ఊరికే కూర్చోకపోతే చదువుకోకూడదా?'

"పోనీలెండి. ఏమిటో చదవ బుద్ధి కాలేదు."

విసురుగా తల పక్కకు తిప్పుకున్నాడు సుధాకర్. భర్త ప్రవర్తన అర్థంకాక వింతగా చూసింది జానకి.

"పడుకో, ఇంకా ఎందుకు కూర్చున్నావు?" తన వైపే చూస్తూ కూర్చున్న భార్యను చూసి ఒళ్ళు మండిన సుధాకర్ కోపంగా అన్నాడు.

జానకి తప్పు చేసినదానిలా తల వంచుకుని మెల్లిగా మంచంవేపు నడిచింది.

• • •

ఆరోజు ఆఫీసులో పనులతో అలిసిపోయిన సుధాకరం విసుగ్గా ఇంటికి బయలుదేరాడు. ఆఫీసులో లేడీ టైపిస్టు కొత్తగా ఏదో ఇంగ్లీషు పత్రికలో పడిన తన కథను చూపిస్తూ గర్వంగా నవ్వుకోవటం గమనించిన సుధాకర్ మనస్సు భార్య గుర్తుకు వచ్చి ముడుచుకుపోయింది. 'ఎంత కాలాన్ని వృథా చేస్తోంది!' అనుకున్నాడు. 'ఎంతసేపూ ఆ వెధవ కుట్లూ కుట్టుమంటే కుడుతుంది. మూల కూర్చునే ముసలమ్మలు నయం. ఛా. మరీ ఏ విషయంలోనూ ప్రత్యేకత లేదు' అని ఆలోచిస్తూ నీరసంగా ఇంటికి వచ్చిన సుధాకర్ గది తలుపులు తోసి ఒక్క క్షణం, తను కల కంటున్నాడా, లేక నిజమేనా అన్న ఆలోచనలో పడ్డాడు. మరుక్షణం

పురుషులతో సమానంగా స్వేచ్ఛగా సంచరించే స్త్రీని చూసి సంతోషపడని పురుషుడు ఉండడు. ఎల్లవేళలా స్త్రీ సుఖ సంతోషాలు మాత్రమే కోరతాడు పురుషుడు. ఒక్కటే పేచీ. ఆలాంటి స్త్రీ తన భార్య అయితే సహించగలశక్తి పురుషునికి ఇంకా అలవడలేదు, మరి!

---

మొహంలోని ఆనందాన్ని దాచుకుంటూ లోపలికి వచ్చాడు.

కుర్చీలో కూర్చుని వ్రాస్తున్న జానకి భర్తవేపు చూసి నవ్వింది. "మీ కోరిక తీరుస్తున్నాను."

"వెరీగుడ్. ప్రఖ్యాత రచయిత్రి జానకీదేవి నా భార్య అని చెప్పుకోవటం నాకెంత గర్వకారణమో నీకెలా తెలుస్తుంది?"

"అవునులెండి. అందుకేగా! చూడండి, నేనెంత ప్రయత్నించినా రాయలేకపోతున్నాను......"

"ఛా. అలా నిరుత్సాహపడకు, జానకీ. ఇప్పుడు ఈ చెయ్యి తిరిగినవాళ్ళందరూ మొదట్లో ఈ మాదిరి నిరుత్సాహపడినవాళ్ళే."

ఆవిధంగా మొదలయింది జానకి రచనా వ్యాసంగం. పెళ్ళయి కాపరానికి వచ్చిన దగ్గిరనుంచీ తన కోరిక ఏదో విధంగా వెలిబుచ్చుతూనే ఉన్నాడు సుధాకర్. అతనికి ముఖ్యంగా కావలిసింది తన భార్య నలుగురిలోనూ ఒక ప్రత్యేకత కలిగి ఉండటం.

జానకి అంతదూరం ఆలోచించదు. ఏదో సామాన్య గృహిణిలా సంసారం గడపటమే ఆమెకు కావలిసింది. భర్త తనను ఈ విధంగా ఒత్తిడి చెయ్యటం ఎందుకో ఆమెకు అర్థంకాదు. నెమ్మదిగా సుధాకర్ బలవంతంవల్ల నైతేనేమి, తన లోపలనే ఎక్కడో చిన్న కోరికవల్ల నయితేనేమి, కథలు వ్రాయగా వ్రాయగా, కొన్నాళ్ళకు మొదటిసారిగా పత్రికలో ప్రచురింపబడ్డ తన కథ చూసిన జానకి గుండె ఒక్కక్షణం ఆగి తిరిగి కొట్టుకోవటం మొదలుపెట్టింది. ఈ కథ వ్రాసింది తనేనా అన్న అనుమానం ఆమెను ఒక పట్టాన వదల లేదు. వెంటనే ఆకాశంలోంచి కిందపడ్డట్టు ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చి పత్రిక పుచ్చుకుని మేడమీదికి పరిగెత్తింది.

ఆఫీసుకు బయలుదేరుతున్న సుధాకర్ భార్య హడావిడి చూసి, "ఏమిటేమి"టన్నాడు.

"ఈ కథ చూడండి. నా కథే. నేను రాసిందే!" సంతోషంతో ఆమెకు మాటలు బయటికి రావడం లేదు. విడిగా ఎన్ని వ్రాసుకున్నా, ఎన్ని చింపేసినా అచ్చులో తన కథ చూసుకునేసరికి ఏదో గొప్ప పదవి లభించినట్టు పొంగిపోయింది.

పత్రిక తీసి చూసి, "కంగ్రాట్యులేషన్స్, జానకీ. ఇదే విధంగా నీ కథలన్నీ ప్రచురింపబడుతూ, నీకు మంచి పేరు వస్తుందని ఆశిస్తాను" అన్నాడు నవ్వుతూ.

ఆరోజు సాయంత్రం సుధాకర్ రోజూకంటె ముందుగా వచ్చేశాడు ఇంటికి.

సిహెచ్. శాంతాదేవి

"మంచి పిక్చరు విడుదలైంది. వెడదామా?"

ఏవో పుస్తకాలు తిరగేస్తున్న జానకి భర్తవేపు చూసి "ఇవాళ వద్దండీ" అన్నది.

"ఏం?"

"పోనీ, మీరు వెళ్ళండి. నాకు [illegible]ంది."

"ఏమిటా పని?"

"మీరు సేవాసదన్ పత్రిక తెప్పించుకున్నట్టు గుర్తు ఎప్పుడో. అది ఎక్కడుందో తెలుసా?"

"అబ్బో! ఏనాడో. నాకు గుర్తులేదుగానీ, నువ్వు త్వరగా తయారవు" అనేసి మరోమాటకు అవకాశం ఇవ్వకుండా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. అయిష్టంగానే లేచి బయలుదేరింది జానకి.

సినిమానించి ఇంటికి వచ్చి వ్రాసుకుంటూ కూర్చున్న భార్యను చూస్తూ, "పొద్దు పోయింది. పడుకోరాదూ?" అన్నాడు సుధాకర్.

"ఉండండి. అయిపోవస్తోంది."

క్రమక్రమంగా జానకి కథలు వివిధ పత్రికల్లో పడ నారంభించాయి. జానకి అన్న పేరు రచయిత్రుల జాబితాలోకి వచ్చేసింది. సుధాకరానికి ఎంత సంతోషంగా ఉన్నదంటే, ఈ కథలు వ్రాసే జానకీదేవి తన భార్యేనా అన్న అనుమానం కలుగుతూంది అప్పుడప్పుడు. సాధ్యమైనంత వరకూ ఆమెను ఎక్కువ ప్రోత్సాహపరచటానికే ప్రయత్నిస్తున్నాడు. తనకు తెలిసిన ఒక పత్రిక ఎడిటర్‌కు సిఫారసు చేసి జానకి సీరియల్ ఒకటి ప్రచురించటానికి ఒప్పించాడు. జానకికి ఇప్పుడు ఒక్కక్షణం తీరిక లేదు. అప్పుడప్పుడు పత్రికలవాళ్ళు ఉత్తరాలు కూడా వ్రాస్తున్నారు, కథలు పంపించమంటూ.

"మొదట్లో మీ మాటలు నిర్లక్ష్యం చేసేదాన్ని. ఇప్పుడనిపిస్తోంది, కథలు రాస్తే కలిగేతృప్తి ఇంకే విధంగానూ ఉండదని" అని జానకి ఎప్పుడేనా అంటే సుధాకర్ అనేవాడు:

"నీ ప్రపంచం నువ్వు ఏర్పరుచుకున్నావు. అదే నాకు సంతోషం."

పాఠకుల దగ్గిరనుంచి కూడా ఉత్తరాలు వస్తున్నాయి. "మీ తాజా రచనలేమైనా ఉన్నాయా?" అనో, "మీరింత అభివృద్ధిలోకి రావటానికి ఎవరి ప్రోత్సాహ"మనో ఈ మాదిరి ప్రశ్నలేకాక, వ్యక్తిగతంగా కూడా కొన్ని విషయాలు అడిగేవారిని చూసి జానకి విసుక్కునేది. అట్లాంటివాటికి జవాబు వ్రాయకుండా భర్తకు చూపించేది. ఇద్దరూ నవ్వుకునేవారు.

"ఈరోజు రేడియోలో నా నాటిక ఉంది. మీరు వినరన్నమాట." రాత్రి ఏడుగంటలకు బట్టలు వేసుకుంటున్న భర్తను అడిగింది జానకి.

సుధాకర్ ఆశ్చర్యపోతూ చూశాడు. "అయితే నువ్వు రావా? టిక్కెట్లు కూడా రిజర్వు చేశాను."

జానకి తల వంచుకుంది.

"అదేమిటి, జానకీ, స్నేహితుడికి కూడా మాట ఇచ్చాను గదా! ఈ ఒక్కసారికీ నీ నాటిక వదిలేసెయ్ నాకోసం."

జానకి మాట్లాడలేదు. భర్తవేపు చూసింది. తను ప్రాధేయపూర్వకంగా చూస్తున్నాడు ఆమెవేపు.

జానకి అతికష్టంమీద మాటలు పెగుల్చుకుంటూ అన్నది: "ఈవేళ నా స్నేహితురాలు వస్తానన్నది మనింటికి."



# తుషార్

భోజనమునకు రుచిని తెచ్చును, కుటుంబమును ఆరోగ్యంగా వుంచును!

తుషార్‌లో ఎ మరియు డి విటమిన్‌లు గలవు. మీ భోజనమునకు అధిక ఆహార విలువను సమకూర్చును. తుషార్‌తో మీరు వండిన రుచిగల వంటకములు వారిని ఆనంద బరుస్తూ మీ కుటుంబమును ఆరోగ్యముగా నుంచును.






**తుషార్-పుష్టికరమైన, రుచిగల భోజనమునకు!**

తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్, కర్నూలు.

ASP/TI-16 Tel

## ఆహుతి

"ఎందుకు?"

"ఊరికే. రమ్మని చెప్పాను."

"ఓహో. అందుకా. మరేం ఫరవాలేదు. మనం లేమని తెలిసి మరేమీ అనుకోదులే." సుధాకర్ నిర్లక్ష్యంగా అన్నాడు.

"మరేమీ అనుకోకండి. నేనివాళ రాలేను." మెల్లిగా అన్నది.

సుధాకర్ తీవ్రంగా చూశాడు. వెంటనే అనునయంగా గొంతు మార్చుకుని, "నా స్నేహితుడికి మాట ఇచ్చానని చెప్పాను. అతని భార్య కూడా వస్తున్నది. మళ్లీ వాళ్ళేమైనా అనుకోగలరు" అన్నాడు.

"అయితే నా స్నేహితురాలేమన్నమాట ఏమీ అనుకోనిది?"

"అలా మొండివాదం చెయ్యకు, జానకీ."

"జానకీ" అంటూ జానకి స్నేహితురాలు లోపలకు వస్తూంది. ఆఖరిసారి భార్య మొహంలోకి పరీక్షగా చూశాడు, సుధాకర్.

జానకి బాగా మెల్లిగా అంది: "క్షమించండి. మరొకనాడు."

ఆమె మాట పూర్తి కాకముందే విసురుగా బయటికి వెళ్ళిపోయాడు.

రాతి బొమ్మలా నిలుచుండిపోయిన జానకి దగ్గిరికి వచ్చింది వసుంధర. "అలా ఉన్నావేం, జానకీ? మీవారెక్కడికో వెడుతున్నారే!"

"అవును. పనుందని వెళ్లారు." నిర్లిప్తంగా అనేసి వెంటనే మొహంలోకి చిరునవ్వు తెప్పించుకుంటూ, "కూర్చో, వసుంధరా" అని స్నేహితురాలితో కబుర్లలో పడ్డది.

చాలాసేపటిదాకా జానకి తనను తాను నిగ్రహించుకోలేకపోయింది. కోపంగా వెళ్లిన భర్త రూపం ఆమెకు క్షణ క్షణానికీ గుర్తువస్తూంది. దేనికోసమైతే భర్త నంత నిర్లక్ష్యం చేసిందో, అంత నిరుత్సాహపరిచిందో, తీరా ఆ నాటకం సరిగా మనసు నిలిపి వినలేకపోయింది. మనసు ఎక్కడో ఆలోచిస్తూంది. భర్త వచ్చేవరకూ అలాగే చూస్తూ కూర్చుంది.

సుధాకర్ ఇంటికి వస్తూనే, "ఏం,అలా ఉన్నావ్?" అని ప్రశ్నించాడు.

"ఏం లేదు" అంది.

సుధాకర్ ప్రసన్నంగానే ఉన్నాడు. పడుకోబోయే ముందు, "ఇందాకటి నా ప్రవర్తనకి కోపం తెచ్చుకోకు, జానకీ" అన్నాడు.

జానకి భర్త మొహంలోకి చూసింది. ఆమె మనసు తేలికయినట్లయింది.

సుధాకర్ అన్నాడు: "తీరా వాళ్ళు రానేలేదు. అతనికి అర్జెంటుగా పని తగిలిందిట. ఫోన్ చేశాడు. మరొక స్నేహితుడితో వెళ్లాను."

ఈ మాటలు వింటూనే జానకి భగ్గుమంది. 'అయితే వాళ్ళు రాకపోవటమే కారణ మన్నమాట ఈ సంతోషానికి' అనుకుంది. ఆ రాత్రి ఆమెకు సరిగా నిద్ర పట్టలేదు.

మరొకనాడు, "ఇవాళ ఏదో సభకి నన్ను ఆహ్వానించారు. అందులో నా ఉపన్యాసం ఉంది. మీరు రావాలి తప్పక" అంది జానకి.

"అలాగే! అబ్బ! ఎన్నాళ్లకి! నీ కిటువంటి రోజులు రావాలని ఎన్నాళ్లు ఎదురుచూశాను" అన్నాడు సంతోషంగా.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాకుండా నేరుగా సాహితీ కార్యాలయానికి వెళ్లాడు. జనం బాగా ఉన్నారు. జానకి ఎక్కడుందో తెలుసుకోవటం కష్టమైంది. అంతమందిలో వెతికే ఓపికలేక ఒకచోట చతికిల పడ్డాడు. కాస్సేపటికి జనమంతా సర్దుకున్నారు. ఒకరి తరవాత ఒకరుగా ఉపన్యసించారు. జానకి మాట్లాడుతూంది. అందరూ మంత్రముగ్ధుల్లా వింటున్నారు. జానకికి ఇంత వాగ్ధోరణి ఉన్నదని ఈనాడే తెలుసుకున్నాడు సుధాకర్. ఆమె చెప్పేది వింటూ కూర్చున్నాడు. జానకి ఎటూ దృష్టి మళ్లించకుండా తదేకంగా మాట్లాడుతూంది. మాట్లాడటం పూర్తయాక ఒక్కసారి ఊపిరి పీల్చుకుని అంతా కలయ చూసింది. సుధాకర్ ఆమె కళ్లబడ్డాడు. ఆమె పెదవుల మీద చిన్న చిరునవ్వు నిలిచింది. వెంటనే దృష్టి మరో వేపు తిప్పుకుని కూర్చుంది. మళ్లీ ఆమె సుధాకర్ వేపు చూడలేదు. సభ ముగిశాక ఒక్కొక్కరే వెళ్లి పోతున్నారు. ఆహూతులంతా జానకీదేవిని కలిసి మరీ వెడుతున్నారు. 'అంతమందిలో తను ఏ హోదాతో ఆమెను కలుసుకోవాలి?' అన్న ఆలోచనలో పడ్డాడు సుధాకర్. 'ఇంత ఆలోచన దేనికీ, ఇప్పుడే కలుసుకోవాలా?' అనుకుని ఇంటి దారి పట్టాడు.

జానకి అందర్నీ వదుల్చుకుని ఎలాగో భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అతను ఎంతసేపటికీ లోపలికి రాకపోవటంతో వేదిక మీదికివచ్చి అంతటా చూసింది. ఎవరూ లేరు. నిరాశగా ఇంటికి బయులు దేరింది.

ఇంటికి వచ్చాక అలసటగా కుర్చీలో వాలిపోయిన జానకిని ఎక్కువగా మాట్లాడించి బాధపెట్ట దలుచుకోలేదు సుధాకర్. మౌనంగా పడుకున్నాడు.

భర్తలోని మౌనానికి కారణం తెలుసుకోలేక గింజుకుపోయింది జానకి. ఎంతో సంతోషంగా ఎన్నో విషయాలు చెప్దా లనుకున్న జానకికి భర్త సమీపానికి కూడా వెళ్లలేనంత అభిమానం అడ్డుపడింది. భార్యాభర్త లిద్దరూ ఆనాడలా మౌనంగా గడిపారు.

రోజులు గడుస్తున్నకొద్దీ, జానకి ప్రతిభ పెరుగుతున్నకొద్దీ సుధాకర్‌లో వింతమార్పు గమనిస్తూంది జానకి. ముఖ్యంగా తనతో ముక్తసరిగా ప్రవర్తించటం అందులో మొదటిది. జానకి అర్థం చేసుకోలేక తికమక పడుతూంది.

ఒకనాడు తప్పనిసరిగా తన సాహిత్యాన్ని గూర్చి భర్తతో మాట్లాడవలసివస్తే, అతని తిరస్కారపు సమాధానం ఆమెలో అలజడి కలిగించింది. అసలు కారణం చాలా చిన్నదే అయినా ఈమధ్య ప్రతిదానికి చిరాకు పడి పోతున్నాడు సుధాకర్. తనలో లోపం ఎక్కడుందో తనకే తెలియటంలేదు. అసలు లోపం ఉన్నదని ఒప్పుకోవటానికీ భయపడుతున్నాడు అతను. జానకి భర్త ప్రవర్తన అర్థం చేసుకోలేకపోతూంది. మొత్తానికి జానకి రచనావ్యాసంగం భార్యా భర్తలమధ్య పెద్ద


# వుడ్‌వార్డ్స్‌తో
## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స్, కడుపునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లు చేయునపుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!




తెలివైన తల్లులు 100 ఏళ్లకు పైగా వాడుచున్నారు.

LPE Aiyars. F. 10 TL

అగాధాన్ని సృష్టించిందని చెప్పవచ్చు.

అర్ధరాత్రి లేచిన జానకికి లైటు వేసుకుని పిచ్చిగా ఆలోచిస్తూ పడుకున్న సుధాకర్ కనిపించాడు. జానకికి ఏమీ అర్థం కాలేదు. లేచి భర్త దగ్గిరికి వెళ్ళింది.

"నిద్రపోలేదా?"

"ఊహుఁ....ఆఁ. ఇప్పుడే లేచాను." అతని కంఠంలో తడబాటు స్పష్టంగా కనిపిస్తోంది.

"అలా ఉన్నారేం?" జానకి ఆదుర్దాగా అడిగింది.

"ఏం లేదు" అని కొంచెమాగి, "జానకీ, ఇప్పుడేమైనా రాస్తున్నావా?" అని అడిగాడు చాలా మామూలుగా.

జానకి నవ్వింది. "ఎప్పుడూ లేనిది, ఏమి టివాళ ఇలా అడుగుతున్నారు?"

"ఊరికేనే. మరీ విశ్రాంతి లేకుండా రాయకు, జానకీ!"

జానకి మాట్లాడలేదు. భర్త ఎందు కలా అంటున్నాడో ఆమెకు అర్థం కాలేదు. మౌనంగా లేచి వచ్చేసింది.

● ● ● ●

క్రమక్రమంగా సుధాకర్‌లో పెద్ద మార్పే కలిగింది. నిప్పుకణికవంటి అసూయా రేణువు మనిషిలో ప్రవేశించిందంటే అది అంతం చేసేవరకూ చల్లారదు. సుధాకర్ ఆ వేడిలోనే దగ్ధమవుతున్నాడు. భార్య తనలోని ఈ మార్పు కనిపెడుతుందేమోనని భయపడుతూ ఉన్నాడు. కానీ జానకిలోని, సౌజన్యం భర్తలోని మార్పుకు అటువంటి కారణం ఆపాదించలేకపోయింది. కేవలం తనమీద జాలివల్ల, ఒక్క క్షణం విశ్రాంతిలేక తను శ్రమించటం ఇష్టంలేక అతను ఆ విధంగా తన వ్రాతలకు అడ్డుపడుతున్నాడని ఆమె నమ్మింది. అప్పుడప్పుడు భర్తను మందలించేది.

"నేను మరీ చిన్నపిల్లని కాదులెండి. ఇదేమంత పెద్ద కష్టంలోది కాదులెండి" అని నవ్వేసేది. కానీ సుధాకర్ అంత తేలిగ్గా నవ్వలేకపోయేవాడు.

భార్యకు ఎక్కడినుండైనా ఆహ్వానాలు వచ్చినా, ఆమె ఉపన్యసించాలని కోరుతూ ఉత్తరాలు చేరినా, చివరికి పత్రికలవాళ్ళు కథలు పంపించమని వ్రాసినా అతనిలో విచిత్రమైన బాధ నరనరాల్లోనూ నిండిపోతూంది. 'తన జానకి, తన భార్య ఇంత అభివృద్ధి చెందినందుకు తను సంతోషించవలసింది పోయి కసిగా ఆమెమీద కత్తి కట్టటమా?' అని ఆలోచించేవాడు అప్పుడప్పుడు, అజ్ఞాతంగా ఉన్న వివేకం మేల్కొన్నప్పుడు. కానీ వెంటనే దాన్ని అణచివేసేది అతని పురుషత్వపు అహంకారం. 'తను ఏనాడూ సభల్లో ఉపన్యసించింది లేదు. అసలు తన నా విధంగా కోరేవాళ్ళు ఉంటేగదా! కోరటానికి తనలో ఎటువంటి అధిక్యంగానీ, ప్రత్యేకతగానీ ఉన్నాయా? జానకి ప్రఖ్యాత రచయిత్రి. ఆమె కథలు వేలమంది చదువుతారు. ఆపైన మెచ్చుకుంటారు. కాబట్టే ఆమెకు సన్మానాలు జరుగుతాయి. తనలో ఏం ఉందని?' రాను రాను సుధాకర్‌లో ఆలోచనలు ఈ విధంగానే ఉంటున్నాయి. 'నా అంతట నేనే భార్యని ప్రోత్సాహపరిచి, ఆమె పురోభివృద్ధికి కారకుణ్ణయాను' అన్న భావం అతన్ని గర్వింపచెయ్యటానికి బదులు, తనను తాను కించపరుచుకునేట్టు చేసింది. 'ఆమె అన్నిటా


మెక్లీన్స్
యొక్క జలదరించే రుచితో
మీ నోరును పరిశుభ్రపరుస్తుంది




మెక్లీన్స్ 3 విధాల పనిచేస్తుంది!

1 శుభ్రపరుస్తుంది పళ్లను పుచ్చేలా చేసే ఆహార అణువులను తొలగిస్తుంది

2 తెల్లగా చేస్తుంది పళ్లమీద పసుపుపచ్చ పొరను తీసివేసి పళ్లను మెరిసేలా చేస్తుంది.

3 రక్షణ కలిగిస్తుంది. మీ పళ్లను, పసుచిగుళ్లను ఆరోగ్యంగాను గట్టిగాను వుంచి వాటికి రక్షణ కలిగిస్తుంది.

అతి తెల్లని పళ్లకు-మెక్లీన్స్

MTP-1-P-1-65/66 TL




ఒక్క చెంచాడు మాత్రంతో మీకు కావలసిన
శక్తి అంతా చేకూరుతుంది

కోకో మాల్టిన్

**పుష్టికరమైన, శక్తిదాయకమైన ఉత్తమ ఆహార పానీయం**

పూర్తి మీగడ **పాలు**, **కోకో**, శ్రేష్ఠమైన **బార్లీ మాల్టు, గ్లూకోజు,** నేర్పుగ మేళవించబడిన కోకో మాల్టిన్ బలమైన కండరాలను, బలిష్ఠమైన ఎముకలను నిర్మించడానికి, శక్తి, ఉత్సాహాలను ఇవ్వడానికి అవసరమైన మాంసకృత్తులు, పిండి పదార్థాలు, ఖనిజ లవణాలు సమృద్ధిగా కలిగియుంది. మిమ్మును ఆరోగ్యవంతంగా, ఉత్సాహకరంగా ఉంచడానికి కోకోమాల్టిన్‌లో **ఏ, బి, బి – 2, డి** విటమిన్లు కూడ చేర్చబడి ఉన్నవి. ఆ బాలవృద్ధులకు ఆరోగ్యంగా ఉన్నప్పుడు, సుస్తీగా ఉన్నప్పుడు ఎల్లప్పుడూ ఇది ఉత్తమ **పోషణి.** కోకోమాల్టిన్ అలసట చెందిన నరాలను సేద తీర్చుతుంది. పండుకొనేప్పుడు వేడిగా తీసుకొంటే సుఖనిద్ర నిస్తుంది.

**కోకో మాల్టిన్ లాబొరేటరీస్,**
ప్రొప్రయిటర్లు: ట్రేడ్ లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్,
**46, పూసారోడ్డు, న్యూఢిల్లీ-5 ఫోన్: 52835**

**ప్రాంతీయ సేల్సు ఆఫీసులు:** TL-NP-32

మైసూరు: కోకో మాల్టిన్ లేబొరేటరీస్, 20, అంబ్రోడీ రోడ్డు, శాంతినగర్, బెంగుళూరు—27.
**ఆంధ్ర:** 142—ఎ/16, పెండర్‌గాస్ట్ రోడ్డు, **సికింద్రాబాద్.**

# ఆహుతి

అధికురాలు తనకన్నా. ఆమెను గుర్తించినంతగా ప్రజలు తనను గుర్తించరు. అంత విశేషం తనలో లేదు.'

ఒకనాటి సాయంత్రం జానకి బట్టలు వేసుకుని బయలుదేరుతూంటే ఉద్రేకాన్ని ఆపుకుంటూ నెమ్మదిగా అన్నాడు సుధాకర్: "ఎక్కడికి వెడుతున్నావు, జానకీ?"

"రేడియో స్టేషన్‌కి. ఇవాళ కొన్ని ప్రోగ్రాములు ఉన్నాయి. వచ్చేసరికి బాగా ఆలస్యం కావచ్చు. మీరు అన్నం తినేసి పడుకోండేం." లాలనగా అంటున్న జానకి మాటలలోని మార్దవాన్ని గమనించలేదు అతను.

"వచ్చేసరికి చాలా రాత్రి అవుతుందా?" సాధ్యమైనంత నిదానంగానే అన్నాడు, తనలోని నాగరికతకు భంగం కలగకుండా.

"అవును. ఏం?"

"ఏం లేదు. మరీ పొద్దుపోయి తిరగటం మంచిది కాదు, జానకీ. ఇటువంటి చిన్న చిన్న ఆహ్వానాలు వదిలి వెయ్యరాదూ?" ఆజ్ఞాపించినట్టుగాక వప్పచెబుతున్నట్టు అన్నాడు.

జానకి ఆశ్చర్యంగా చూసింది. "మీరనుకున్నంత కష్టంగా ఏం లేదు లెండి."

జానకి బయలుదేరబోతూంటే సుధాకర్ కటువుగా అన్నాడు: "ఈ రోజు వెళ్లవద్దులే, జానకీ. మరీ అంత ముంచుకుపోయే రాచకార్యా లేమీలేవుగా."

జానకి వింతగా చూసింది. భర్త దగ్గిరికి వచ్చింది. "మీ రెందుకలా ఉన్నారు?"

సుధాకర్ మాట్లాడలేదు.

"నే నిటువంటి కార్యకలాపాల్లో పాల్గొనటం మీకు ఇష్టం లేదా?"

"అవును. నువ్వీ తిరగటాలు మానేస్తే మంచిది."

జానకి ఒక్కక్షణం మాట్లాడలేదు. "అయితే మానెయ్యమంటారా?" ఆమె కంఠంలోని జాలి అతను గుర్తించలేదు.

"ఊఁ...." అనేసి తన మొహం కనపరచకుండా అవతలికి వెళ్లిపోయాడు. జానకి అలాగే నిలబడింది. ఏనాడూ భర్త మాటకే కాదు...ఎవరి మాటకూ ఎదురు తిరగని జానకి ఈ విసురుకు తట్టుకోలేక స్థాణువులాగా నిలబడింది.

ఒక్కసారి ఉలిక్కిపడి టైము చూసుకుంటే చాలా గంటలు గడచిపోయాయి. 'ఈపాటికి ఆహూతులంతా వెళ్లిపోయి ఉండచ్చు.' నిట్టూర్చి లోపలికి వెళ్లిపోయింది.

ఆ రాత్రి భార్యా భర్తలిద్దరూ మాట్లాడుకోలేదు. ఎన్నడూ ఏ భేదాభిప్రాయమూ ఎరగని ఆ దంపతుల మధ్య ఆ రాత్రి సన్నటి తెర జారింది.

మరునాడు లేస్తూనే జానకి ప్రసన్నంగా ఉంది. రాత్రి జరిగిన సంఘటన మరిచిపోయినట్టు భర్తతో మామూలుగా మాట్లాడింది. సుధాకర్ ఆమెతో సరిగా మాట్లాడలేకపోయాడు. మనసు ఒప్పుకోకపోయినా అతని అంతరాత్మలో కెలికే పుండు బాధ పెడుతూనే ఉంది.

రోజులు గడుస్తున్నాయి. జానకి కొన్ని ప్రోగ్రాములకూ, ఆహ్వానాలకూ వెళ్ళటం మాత్రమే మానుకుంది. ఆమె రచనా ప్రవాహం ఆగలేదు. దానికి ఏ ఆటంకమూ రాదనుకుంది. తన హృదయంలోని భావాలన్నిటినీ నిర్వికారంగా బయట పెట్టవచ్చు ననుకుంది. తనలోని కోర్కెలను కాగితాలమీద నింపవచ్చు ననుకుంది. ఏ దుష్టగ్రహాలూ తనలో ఈ శక్తిని అరికట్టలేవనుకుంది. కానీ, కానీ, జానకి నమ్మకాలు కూలిపోయాయి. ఆమె కట్టుకున్న ఆశా సౌధాలు నేలమట్టమయ్యాయి. మానవులలో కూడా రాక్షసులు ఉంటారని మొదటిసారి తెలుసుకుంది అమాయక స్త్రీ ప్రతినిధి జానకి.

ఒంటరిగా కూర్చున్న జానకి లైటుకేసి నిశ్చలంగా చూస్తోంది. క్షణంక్రితం సుధాకర్ కోపంగా తోసేస్తే కిందపడి గాలికి ఎగురుతున్న కాగితాలమీద లేదు ఆమె దృష్టి. ఆ అసంపూర్తి రచనను వ్రాయాలన్న ధ్యాస లేదు ఆమెకు. భర్త ప్రవర్తనకు ఏ విధమైన నిర్వచనమూ చెప్పుకోలేక నిర్వికారంగా చూస్తోంది.

గదిలో మంచంమీద పడుకున్న సుధాకర్ నిద్రపోవటంలేదు. కళ్ళు తెరుచుకుని శూన్యంలోకి చూస్తున్నాడు. ఒక నిమిషంక్రితం తను చేసిన పని మంచిదా, చెడ్డదా అని ఆలోచించటం లేదు అతను. ఆమె తనను మంచివాడనుకుంటున్నదా, చెడ్డవాడనుకుంటున్నదా? అని ఆలోచిస్తున్నాడు.

* * *

''ఇంకా ఎంత రాత్రి లైటు వేసుకుని కూర్చుంటావు? దేనికైనా హద్దు ఉండాలి.'' ఆశ్చర్యంగ తనవైపు చూస్తున్న జానకిని గమనించలేదు అతను.

''ఈవేళ కీ రాతలు కట్టిపెట్టు.'' కఠినమైన ఆజ్ఞ.

భర్త కంఠంలోని కాఠిన్యం స్పష్టంగా తెలుస్తున్నా తన నిస్సహాయతను బయటకు కనపరచకుండా, ''ఇదిపూర్తి చెయ్యాలి'' అంది జానకి.

''నా మాట వినవన్నమాట.''

''..............''

''ఇకనించీ నీ రాతలు నా కళ్ళబడితే...'' ఇంక మాటలు పెంచలేదు అతను. టేబులుమీది కాగితాలు విసురుగా కిందికి తోసేశాడు. ఆపుకోలేని కోపంతో చరచరా అంగలు వేసుకుంటూ గదిలోనుంచి వెళ్ళిపోయాడు.

ఒక్కసారిగా ఎదురుచూడని సన్నివేశాన్ని జానకి వెంటనే ఆకళింపు చేసుకోలేకపోయింది. కానీ, ఆమె ఆ విధంగా శిల అయిపోయే అదృష్టం ఆమెకు లేదు. వెంటనే జరిగిన సంగతి తెలిసింది. కాదు—గుర్తుకు వచ్చింది. కిందపడ్డ కాగితాలకేసి చూసింది.

తన మనస్సూ భావాలూ అన్నీ ఆ కాగితాల్లో నిండి ఉన్నాయి. తన ప్రాణాలు తన కలంలోనే ఉన్నాయి.

జానకి నిట్టూర్చింది. మొహాన్ని చేతులతో కప్పుకుంది. ఆమె ఏడవటం లేదు. ఆమె కంట్లో నీటిచుక్క లేదు. గాలి కెగురుతున్న తన హృదయాన్ని భద్రపరుచుకోలేని నిస్సహాయ స్థితిలో అల్లాడుతూంది. ఆమె మనసూ, హృదయమూ మండి మసిఅయినాయి. అసూయాగ్నిలో దగ్ధమైనాయి. ఆమె తనకై తను ఏమీ మిగుల్చుకోలేదు, శరీరం తప్ప. ★

